క్లుప్తంగా

ఇస్కాలలో పారిశుద్ధ్య చర్యలు


వాటర్ ట్యాంకు క్లోరినేషన్ చేయిస్తున్న సర్పంచ్

పాములపాడు: మండలంలోనిఇస్కాల గ్రామంలో సర్పంచు మౌలాలి, పంచాయతీ కార్యదర్శి ఖాజా బుధవారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలో ప్రధానంగా మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో సున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ కలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. ఏఇంట్లోనైనావాంతు లు, విరేచనాలతో బాధపడుతున్నట్‌లెతై వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వివరించారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీహైస్కూల్ విద్యార్థులు

నందికొట్కూరు: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సలీంబాషా అన్నారు. బుధవారం పట్టణంలోని బైరెడ్డి నగర్‌లోని జెడ్పీ హైస్కూల్(కోట) నుంచి పటేల్ వరకు 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. పిల్లలు బడికి... పెద్దలు పనికి...పనికి ఎందుకు తొందర చదువుకో, బడికి పోదాం-భవితను మార్చుకుందాం అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాలమ్మ, అరుణ, విజయభారతి, లలితమ్మ, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచు, వైద్యసిబ్బంది

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో ప్రజలకు బుధవారం సర్పంచ్ జనార్దన్‌గౌడ్ ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అతిసారం వ్యాధి బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా వ్యక్తి గత శుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ జానకీరామ్ పదవీ విరమణ


పదవీ విరమణ పొందిన ఎంఈఓ జానకీరామ్‌ను సన్మానిస్తున్న ఫాదర్ వినీత్

ఆత్మకూరు: మండల విద్యాశాఖ అధికారి(ఎంఈఓ) జానకీరామ్ గురువారం పదవీ విరమణ పొందారు. ఆయన పదవీ విరమణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ అయిన ఎంఈఓ జానకీరామ్ దంపతులకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, డొపాల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ వినీత్ ఎంఈఓను సత్కరించి, ఆయన శేష జీవితం బాగుండాలని ఆకాంక్షించారు. సీఐ లక్ష్మీనారాయణ, హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ హరికృష్ణ, ఫాదర్ సిస్స్ పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే బుడ్డా


మల్లన్న దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే బుడ్డా

శ్రీశైలం టెంపుల్ : శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే బుడ్డాకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చక స్వాములు, వేద పండితులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. తర్వాత ఎమ్మెల్యే స్వామి వారికి అభిషేకాన్ని, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యేకు వేద పండితులు, అర్చకులు వేదాశీర్వచనంతో శేష్ట వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

- ప్రజాస్వామ్యంలో దాడులు మంచి పద్ధతి కాదు
- గతంలో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలిచినా ఏ ఒక్కరిపై దాడికి పాల్పడలేదు
- కూటమి అసత్య ప్రచారాల వల్లే ఓటమి
- పార్టీకి పట్టున్న వార్డుల్లో ఒకటి రెండు ఓట్లు మాత్రమే రావడం అనుమానాలకు తావిస్తోంది
- వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి


నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, నాయకులు, కార్యకర్తలు ఏ మాత్రం అధైర్యపడొద్దని, ఎల్లప్పుడూ అండగా ఉంటానని, సమస్యలను సమిష్టిగా ఎదుర్కొందామని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మహానంది, బండిఆత్మకూరు మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటమికి కారణాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. శిల్పా మాట్లాడుతూ గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొంది అధికారంలోకి వచ్చినా ఐదేళ్లలో ఏ ఒక్కరిపై దాడులు చేయలేదని, కక్షసాధింపు చర్యలకు దిగకుండా రాజకీయాలు హుందాగా చేశామని గుర్తు చేశారు. కానీ నేడు అందుకు భిన్నంగా టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేస్తుండటం బాధాకరమన్నారు. వారిని కొడతాం, వీరిని కొడతాం అంటూ నా దృష్టికి సైతం వస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దాడులే మేలు చేస్తాయనే ధోరణి మంచి పద్ధతి కాదన్నారు.

ప్రశాంతతకు మారు పేరు శ్రీశైలం నియోజకవర్గం

ప్రశాంతతకు శ్రీశైలం నియోజకవర్గం మారుపేరని, నేడు అందుకు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని శిల్పా ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తారని, నాయకులు సంయమనం పాటించాలన్నారు. ఓర్పుతో రెండు అడుగులు తగ్గినా ఏమి పోదన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో దాడులు ఏ మాత్రం మంచి పద్ధతి కాదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఇచ్చిన నెరవేర్చలేని హామీలు, అసత్య ప్రచారాల వలన పార్టీ ఓటమి చెందిందన్నారు. దీనికి తోడు ఈవీఎం టాంపరింగ్ మీద అనుమానాలు ఉన్నాయని, వైఎస్సార్ సీపీ పట్టున్న వార్డుల్లోనూ ఒకటి రెండు ఓట్లు మాత్రమే రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలకు రూ. 2.70లక్షల కోట్లు లబ్ధి చేకూర్చినా తీర్పు వ్యతిరేకంగా ఇచ్చారన్నారు. రాష్ట్రంలో తక్కువ మెజారిటీతో ఓటమి చెందిన వారిలో 8వ స్థానంలో ఉన్నానన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. సమావేశంలో బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శశికళారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ సుజాతమ్మ, మాజీ జెడ్పీటీసీ మద్దిలేటి, ఎస్టీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ విక్రమసింహా నాయక్, సీనియర్ నాయకులు గాజులపల్లె కిట్టు, కొండా మధుసూదన్‌రెడ్డి, గజ్జ పెద్ద పక్కీరయ్య, శరభారెడ్డి, కుంచపు శ్రీనివాసులు, పిట్టం పెద్ద రామ సుబ్బారెడ్డి, కందుల రఘురామిరెడ్డి, వెంగళరెడ్డి పేట సోమశేఖర్‌రెడ్డి, దీప్‌కాంత్‌రెడ్డి, లింగాల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ బుధవారం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

నందికొట్కూరు: కుల, మతాలకు అతీతంగా రైతులకు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేయాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రఘునాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్ర కులాలలోని పేద రైతులకు పెట్టుబడి కోసం పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలకు పెట్టుబడి కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతన్నలను ఆదుకోవాలని విన్నవించారు. ఏపీ రైతు సంఘం నాయకులు సోమన్న, శేఖర్, ఇజ్రాయిల్, సుధాకర్, మౌలాలి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే అతిసారం దూరం


డాక్టర్ యశశ్విని, పారుమంచాల పీహెచ్‌సీ

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు వహిస్తే అతిసారం వ్యాధి దరిచేరదని పారుమంచాల పీహెచ్‌సీ వైద్యురాలు యశశ్విని తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం డయేరియా(వాంతులు, విరేచనాలు), మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు వ్యాపించే సీజన్ కనుక ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతిఒక్కరూ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. తాగునీరు, ఆహారం వల్ల వ్యాధులు వ్యాపించే అవకాశాలు మెండుగా ఉన్నందున ప్రతి ఒక్కరూ కాచి వడగట్టిన, క్లోరిన్ ట్యాబ్లెట్లు కలిపిన సురక్షితమైన మంచినీటిని తాగాలన్నారు. తాగునీటిని శుభ్రమైన పాత్రలు, బిందెలు, ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వచేసుకోవడంతో పాటు, నీటిపై దోమలు వాలకుండా, కలుషితం కాకుండా వాటిపై మూతలు అమర్చుకోవాలని సూచించారు. అప్పటికప్పుడు వండుకున్న వేడిగా ఉన్న ఆహారాన్ని భుజించాలన్నారు. అలా వీలుకాని వారు వండుకున్న ఆహారం, కోసిన పండ్లపై దోమలు, ఈగలు వాలకుండా శుభ్రమైన పాత్రల్లో నిల్వచేసుకొని మూతలు ఉంచుకోవాలని చెప్పారు. లేని ఎడల ఆహారాన్ని రిఫ్రిజ్‌రేటర్‌లో నిల్వచేసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా ఇంట్లోని లెట్రిన్లు వినియోగించుకోవాలని, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం ఉంచుకోవాలని తెలిపారు. మలవిసర్జనకు వెళ్లొచ్చాక చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. వీటన్నింటితో పాటు ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు, చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాని తెలిపారు. ఒకటికి నాలుగు పర్యాయాలు విరేచనాలు అయినట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందాలని సూచించారు. వాంతులు, విరేచనాలు అవుతున్నట్లయితే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించటంతో పాటు మజ్జిగ, టెంకాయనీళ్లు, పలుచటి పప్పుచారు అన్నం, గంజిని తాగించడంతో పాటు వైద్యునివద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

కొత్తపల్లి: మండలంలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండల స్థాయి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల నాయకులు ఎస్ స్వాములు, ఏస్ సంజీవ రాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని శివపురం, సింగరాజుపల్లి, గుమ్మడాపురంతో మరికొన్ని గ్రామాల్లో వాంతులు విరోచనాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. వర్షాకాలం ప్రారంభమై గ్రామాల్లో తాగునీరు కలుషితమవుతుందని అన్నారు. ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయించడం లేదన్నారు. నీటి కలుషితం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో వెంటనే పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వైద్యాధికారులు గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి ముందస్తుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రూ. పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మహానంది: శిరివెళ్ల మండలం పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరున్ బీ మృతికి అటవీశాఖ అధికారులే బాధ్యత వహించాలని, ఆమె కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎస్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నా డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చిరుత చేతిలో ఇంకెంత మంది మృతి చెందాలో అంటూ ఆవేదన చెందారు. ప్రజలపై దాడులు చేస్తున్న చిరుతపులి పట్ల ఎలాంటి చర్యలు తీసుకోలేని అటవీశాఖ అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. చిరుతను త్వరగా పట్టుకుని సుదూర ప్రాంతాలకు తరలించాలన్నారు.

నేడు ఆలయ భూముల వేలాలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని శింగవరం గ్రామంలో వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలకు చెందిన సుమారు 42 ఎకరాల భూములకు గురువారం బహిరంగ వేలాలు నిర్వహించనున్నట్లు ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. ఏడాది కౌలు కాలపరిమితికి నిర్వహించే బహిరంగ వేలాల్లో ఆసక్తి కలిగిన రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎస్‌సీ మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్‌ప్రసాద్

పగిద్యాల: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని నేషనల్ సీడ్ కార్పొరేషన్ మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద సీఈఓ ఖాజా అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విత్తనాల ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పండించిన పంటను విత్తన ఉత్పత్తి చేస్తే మార్కెట్ ధర కంటే 20 శాతం అధికంగా కొనుగోలు చేస్తామని వెల్లడించారు. గింజలో తేమ శాతం 13 శాతం ఉండాలని నకిలీ విత్తనాలు లేకుండా చూసుకోవాలన్నారు. సీడ్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తే రైతులకు 80 శాతం వరకు ముందస్తు అడ్వాన్స్ ఇస్తోందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు డీలర్ షిప్ తీసుకోవాలంటే రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. డీలర్‌కు కేవలం 8 నుంచి 15 శాతం వరకు కమిషన్ ఇస్తామని స్పష్టం చేశారు. అన్ని రకాల విత్తనాలు ఉంటాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సహకార బ్యాంక్ చీఫ్ మేనేజర్ సరోజమ్మ, ఇఫ్‌కో మార్కెటింగ్ మేనేజర్ మహేష్, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు


గవర్నమెంట్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచిచూస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే జయసూర్య హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. పిల్లలు తింటున్న భోజనాన్ని రుచి చూశారు. భోజనం మెనూ ప్రకారం వడ్డించలేదని, నాణ్యత కొరవడిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించలేని పక్షంలో మానుకోవాలన్నారు. పేద విద్యార్థులకు రుచికరంగా భోజనం అందివలేని ఏజెన్సీని రద్దు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హెచ్ఎంకు ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ముర్తుజావలి, భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దర్శనానికి వచ్చి తప్పిపోయిన భక్తుడు


అంజిరెడ్డి

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన సంగారెడ్డికి చెందిన భక్తుడు అంజిరెడ్డి తప్పిపోయినట్లు పోలీసులు తెలిపారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి అంజిరెడ్డి మంగళవారం రాత్రి పదిన్నరకు మహానందికి వచ్చారని, అర్ధరాత్రి 1.30 గంటలకు టాయిలెట్‌కు అని చెప్పి వెళ్లిన ఆయన తిరిగి రాలేదన్నారు. అంజిరెడ్డికి కల్లు తాగే అలవాటు ఉందని, గత నాలుగు రోజులుగా తిరుపతి, కాణిపాకం తిరుగుతూ ఇక్కడికి వచ్చారన్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు చేశారని చెప్పారు. ఎవరైనా గుర్తిస్తే సెల్: 98660 84584కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి


సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ జవహర్‌బాబు

కొత్తపల్లి: రైతులు సాధారణ వ్యవసాయంతో పాటు పండ్లతోటల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ జవహర్ బాబు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో సాధారణ వ్యవసాయానికి బదులుగా పండ్లతోటలను సాగుచేసుకునేందుకు ప్రాధాన్యత ఇస్తే ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతారన్నారు. గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి హామీ పథకం సిబ్బంది రైతులతో కలిసి పండ్ల మొక్కల పెంపకం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీఓ రాజు నాయక్, ఈసీ శ్రీనివాసులు, సీఓలు నాగేశ్వరరావు, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: రైతులు పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గంగావతి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ గ్రామాణీ ఉపాధి హామీపథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 19 రకాల పండ్లతోటల పెంపకంపై నూరు శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా నూతనంగా జాబుకార్డులు కావాల్సినవారు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ జయంతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమణమ్మ

పగిద్యాల: మండలంలోని లక్ష్మాపురం అంచె వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ కోరారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డీసీఓ ఆదేశాల మేరకు పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతిలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని ఈనెల 28వ తేదీ సాయంత్రంలోగా పాఠశాలలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు 29న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊరించి ఉసూరుమనిపిస్తున్న మేఘాలు


తాటిపాడు వద్ద ముసురుకొని ఊరిస్తున్న మేఘాలు

జూపాడుబంగ్లా: సీజన్ ప్రారంభంలో వర్షాలు బాగానే కురిసినా వారం పదిరోజులుగా వరుణుడు ముఖం చాటేస్తున్నాడు. రోజూ ఆకాశంలో మేఘాలు ముసురుకమ్ముకొని ఉండటంతో పాటు అప్పుడో ఇప్పుడో వర్షం కురిసేలా మేఘాలు ఊరించి ఉసూరు మనిపిస్తుండటంతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. మండలంలోని మండ్లెం, తర్తూరు, తంగడంచ, పారుమంచాల, పి.లింగాపురం, తూడిచెర్ల, తాటిపాడు, భాస్కరాపురం తదితర గ్రామాల్లో రబీ సీజన్‌గాను మొక్కజొన్న పంట 5,720 ఎకరాల్లో సాగుచేశారు. బోర్లు, బావులున్న రైతులు పంటలకు నీటిని పారించుకుంటుండగా వర్షాధారం, కేసీ కాల్వ కింద పంటలు సాగుచేసిన పంటలకు సాగునీరు లేకపోవడంతో వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. పంటలు సాగుచేసి 20 రోజులు కావస్తోంది. మరో వారం రోజుల్లోగా వర్షం కురవకపోతే సాగుచేసిన పంటలు ఎండుమొహం పట్టి పంట నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపైనే గుర్రాలు.. తరచూ ప్రమాదాలు


రోడ్డుపై సంచరిస్తున్న గుర్రాలు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వాహనాలు అధిక సంఖ్యలో వస్తుంటాయి. అయితే మహానంది సమీపంలోని ప్రధాన దారిపై నిత్యం గుర్రాలు, గాడిదలు సంచరిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏడాది క్రితం బైక్‌పై వెళ్తున్న వెంకటేశ్వర్లు గుర్రాలు అడ్డు రావడం వాటిని ఢీ కొనడంతో మృత్యువాత పడ్డాడు. అలాగే పదుల సంఖ్యలో ప్రయాణికులు, భక్తులు గాయపడ్డారు. దేవస్థానం అధికారులు, పోలీసులు స్పందించి గుర్రాలు, గాడిదల యజమానులతో మాట్లాడి రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి




ఆత్మకూరు గౌడ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన దృశ్యం, మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, శ్రీశైలంలో విద్యార్థుల ర్యాలీ

ఆత్మకూరు: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మదక ద్రవ్యాలకు బానిస కావొద్దని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి గౌడ్ సెంటర్ మీదుగా డీఎస్పీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్‌ల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వ్యాయామం, క్రీడలను అలవాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణ్, ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి, సెబ్ సీఐ మారుతీరావు, ఎస్ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో భారీ ర్యాలీ

శ్రీశైలం: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాల్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీఐ ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులంతా ముక్త కంఠంతో 'చెడు వ్యసనాలకు బానిస కావద్దని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉన్నత చదువులపై ఏకాగ్రతను పెంచుకోవాలని' నినాదాలు చేశారు. దీనికి ముందుగా స్కూల్ ప్రాంగణంలో మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల జరిగే పరిణామాలను విద్యార్థులకు సీఐ వివరించారు. హైస్కూల్ ప్రాంగణం నుంచి బయలుదేరిన ర్యాలీ దేవస్థానం పరిపాలన భవనం రోడ్డు, శివసదనం సర్కిల్, నంది మండపం, గంగాధర మండపం మీదుగా చివరకు హైస్కూల్ ప్రాంగణం చేరింది.

పాములపాడు: మత్తు పదార్థాలు తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమని పీడీ రాజశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఏఎస్ఆర్‌జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఉపాధ్యాయులు, భవిత సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

వెలుగోడు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పాతబస్టాండ్ అరుగుల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు షాషావలి, ఉస్సేన్, హెడ్ కానిస్టేబుల్స్ సుధాకర్, నూర్ అహ్మద్, పోలీసులు మద్దిలేటి నాయక్, శుభకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన కల్పించండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, డీఎంఅండ్‌హెచ్ఓ, సిబ్బంది

నంద్యాల టౌన్: సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని కలెక్టర్ శ్రీనివాసులు వైద్య,ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో బుధవారం డీఎంఅండ్‌హెచ్ఓ, వైద్యశాఖ అధికారులతో కలిసి సికిల్‌సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ శరదాబాయి, డాక్టర్ కాంతారావు నాయక్, మలేరియా అధికారి కామేశ్వర రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.